క్లుప్తంగా

సరుగుడుతోట నరికివేతకు బ్రేక్



సరుగుడు అక్రమ నరికివేతను అడ్డుకున్న వీఆర్వో

పరవాడ: పి.బోనంగి రెవెన్యూ పరిధిలో సరుగుడు తోట అక్రమ నరికివేతను పరవాడ రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 19/1 లో సుమారు రెండెకరాల విస్తీర్ణం కలిగిన పెద్దావు చెరువులో కొన్నేళ్ల కిందట నాటిన సరుగుడు తోటను రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా స్థానికులు కొందరు అక్రమంగా నరికి తరలించడానికి చేస్తున్న సన్నాహాలను వీఆర్వో సత్యనారాయణ గుర్తించారు. శనివారం సరుగుడు అక్రమ నరికివేతను అడ్డుకుని విషయాన్ని పరవాడ తహసీల్దార్ ప్రకాశరావు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ స్థలంలో నాటిన సరుగుడు తోటలను అనుమతులు లేకుండా కటింగ్ చేయడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ ప్రకాశరావు చెప్పారు. కటింగ్ చేసిన కలపను వేలం వేస్తామని తెలిపారు.

ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో ఎంఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో 52వ భద్రతా వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎస్ఆర్ఎం కేంద్రంలో సొసైటీ కార్యదర్శి జెట్టి సుబ్బారావు భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మన లక్ష్యం-ప్రమాద రహితం కార్యక్రమంపై సుబ్బారావు మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కోసం యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భద్రత ప్రమాణాలపై యాజమాన్యాలు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక భద్రతపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ఎం సొసైటీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన విద్యార్థులతో బెహరా విజయ చైతన్య సిబ్బంది

గోపాలపట్నం: బెహరా ఐటీఐ టెక్నికల్ క్యాంపస్‌లో ఎయిర్‌కండీషనర్ మెకానిజంపై నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. రిఫ్రిజిరేటర్, ఎయిర్‌కండిషనర్, ఆపరేషన్స్, ట్రబుల్స్‌ను గుర్తించడం వంటి అంశాలుపై బెహరా ఐటీఐలో శిక్షణ ఇచ్చారు. శిబిరంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విజయచైతన్య మాట్లాడుతూ సాధారణ శిక్షణతో పాటు నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఇది విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు లీలా ప్రసాద్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న ఆదిరెడ్డి మురళి తదితరులు

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బరిలో ఉన్న అభ్యర్థుల తరపున ఆయా పార్టీల నాయకులు పట్టభద్రుల ఇళ్లకు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వార్డుల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. 94వ వార్డు బీసీ కాలనీలో శనివారం వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ బల్ల రాంబాబు, నాయకులు ముత్త నాయుడు, తామర్ల నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిట్ సందడి

- రెండో రోజు అదే జోష్
- జీఐఎస్ సదస్సు విజయవంతం



సచివాలయ సిబ్బంది సెల్ఫీ

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో పాల్గొనడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

ప్రవేశ మార్గం వద్ద ప్రతీ ఒక్కరిని గుర్తింపు కార్డులు, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి లోపలికి అనుమతించారు. సదస్సు ప్రాంగణంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సదస్సు నిర్వహణలో ఎటువంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పోలీసులు ప్రశంసనీయ పాత్ర పోషించారు.

సదస్సు విజయవంతం

రెండు రోజుల జీఐఎస్ సదస్సు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు రెండో రోజు సైతం హాజరయ్యారు. విభిన్న వేదికలపై ఏకకాలంలో పెట్టుబడులకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వచ్చిన లక్ష్యం నెరవేరడంతో సదస్సుకు వచ్చిన పారిశ్రామిక వేత్తల్లో జోష్ కనిపించింది. పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సు ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టడానికి యువత రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం స్టాల్ మంచి ఆదరణ పొందింది. వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేకతలను వివిధ దేశాల ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. ఏపీలో సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతినిధులు ప్రశంసించారు.

విద్యార్థుల సందడి

సదస్సులో రెండో రోజున విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. దీంతో ఏయూతో పాటు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో జరుగుతున్న ఎంవోయూలు, సెషన్స్‌ను వీక్షించడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఆసక్తి చూపారు. దీంతో సమ్మిట్ ప్రాంగణం విద్యార్థులతో కళకళలాడింది. మేనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విదేశీ విద్యార్థులు సైతం హాజరయ్యారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు వస్తున్న ప్రతినిధులు

నెట్‌వర్క్ డెవలప్‌మెంట్

విభిన్న రంగాలలో పనిచేస్తున్న నిపుణులు తమ నెట్‌వర్క్‌ను డెవలప్ చేసుకోవడానికి ఈ సదస్సును వేదికగా మలుచుకున్నారు. విభిన్న సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, నిర్వాహకులతో కలసి మాట్లాడారు. తాము పనిచేస్తున్న రంగాలను ఆయా సంస్థలతో అనుసంధానించే దిశగా చర్చలు జరిపారు. పరోక్షంగా అనేకమంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలచి వారి పరిధిని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

భారతీయ కళలకు ఫిదా

పలువురు భారతీయ కళలకు ఫిదా అయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణ నుంచి శ్రావ్యంగా వచ్చే సంగీతాన్ని వింటూ విదేశీయులు తన్మయత్వానికి లోనయ్యారు. సర్వసిద్ది లక్ష్మణ స్వామి బొబ్బిలి వీణపై శ్రావ్యంగా స్వరాలను పలికిస్తుంటే విదేశీయులు తమ సెల్‌ఫోన్లతో వీటిని చిత్రీకరించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలమంచిలికి చెందిన జయవాణి అక్కడిక్కడే తాటాకుతో దండలు తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. తోలు బొమ్మలు, హస్తకళా రూపాలు, చేనేత వస్త్రాలను చూడడానికి భారతీయులతో పాటు, విదేశీయులు ఆసక్తి చూపారు.



విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఔత్సాహికులు



బొబ్బిలి వీణను కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

వెంకటాద్రికి ఉచిత బస్సు సౌకర్యం



బస్సుకు పూజ చేస్తున్న అంబికా గణేష్, ప్రధానార్చకుడు రామానుజమ్

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భక్తుడు, అంబికా స్వీట్స్ అధినేత గణేష్ కొత్త బస్సు కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి శనివారంతో పాటు ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో భక్తులను వెంకటాద్రిపైకి ఉచితంగా తీసుకెళ్లి తీసుకువస్తారు. వెంకటాద్రిపై శనివారం బస్సుకు ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. అనంతరం అంబికా స్వీట్స్ అధినేత గణేష్ బస్సును ప్రారంభించారు. ప్రధానార్చకుడు రామానుజమ్ మాట్లాడుతూ వెంకటాద్రికి భక్తుల రద్దీ విశేషంగా పెరగడంతో బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే వెంకటాద్రిపై జరిగే విశేష ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు కూడా బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక రోజుల్లో భక్తులను ఆటో, వ్యాన్ ద్వారా వెంకటాద్రికి తీసుకువెళ్తున్నారు. ఇక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అర్చకులు తెలిపారు.

భద్రతకు పెద్దపీట

ఎన్టీపీసీ జీజీఎం సిన్హా



దీపాంజలినగర్‌లో సేఫ్టీవాక్ నిర్వహిస్తున్న నివాసితులు, ఉద్యోగులు



సింహాద్రి ఎన్టీపీసీలో జెండాను ఆవిష్కరిస్తున్న సంస్థ జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో 52వ జాతీయ భద్రతా దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నివాసితులు, ఉద్యోగులతో కలిసి సేఫ్టీ వాక్ నిర్వహించారు. వారితో భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాంటులో సంస్థ జీజీఎం సిన్హా సేఫ్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీజీఎం మాట్లాడుతూ భద్రత ప్రమాణాలు పాటించాలని ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. భద్రతా సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. ప్రమాదాలను అరికట్టడడంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం!



దేశపాత్రునిపాలెంలో గోతులతో రైల్వే వంతెన కూడలి

పరవాడ: గాజువాక-పరవాడ రహదారిలో దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలి గుంతలమయంగా ఉంది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అచ్యుతాపురం, పరవాడ, సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసమై ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. రైల్వే వంతెన నాలుగు రోడ్ల కూడలిలో బూడిద లారీల రాకపోకలతో గంటల తరబడి ట్రాఫిక్ కు అంతరాయం కలగడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు తమ గమ్యానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని వాపోతున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి గుంతల రహదారికి మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీతంరాజును భారీ మెజార్టీతో గెలిపించండి



95వవార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముమ్మన




గుల్లేపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు తదితరులు

సింహాచలం: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పట్టభద్రులను కోరారు. వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, జీవీ కాలనీ, మరిడి మాంబ కాలనీ, గాయత్రీనగర్ ప్రాంతాల్లో శనివారం ముమ్మన దేముడు విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ చందు యాదవ్, నాయకులు జొన్నాడ సాయికృష్ణ, అంగటి సూరిబాబు, 502 సచివాలయం కన్వీనర్లు గోకివాడ బుజ్జి, విజయేంద్ర కృష్ణ, యలమంచిలి శ్రీను, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ కోరారు. శ్రమశక్తినగర్‌లో శనివారం ఆయన పలువురు పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు పట్టం కట్టాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో నాయకులు సాంబ మూర్తి, దామోదర్, దయానంద్, మూర్తి, నరసింగ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని మొగలిపురం,మల్లునాయుడు,గుల్లేపల్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, యడ్ల నాయుడు, ఐడీ బాబు, ఎంపీటీసీ కనకరాజు పాల్గొన్నారు.



మొగలిపురంలో...

ప్రకృతి సాగును పరిశీలించిన విదేశీ బృందం



సచివాలయంలో ప్రదర్శించిన ప్రకృతి సాగు దిగుబడుల గురించి వివరిస్తున్న విజయకుమార్



సేంద్రియ విధానంలో వరి సాగు చేస్తున్న రైతుతో మాట్లాడుతున్న విజయకుమార్

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ కుమార్(రిటైర్డ్ ఐఏఎస్)తో పాటు పలు దేశాలకు చెందిన బృందం శనివారం సందర్శించింది. అనకాపల్లి డీపీఎం లచ్చన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పలు వ్యవసాయ క్షేత్రాలకు బృందాన్ని తీసుకెళ్లారు. విదేశీ ప్రతినిధులకు సూర్య మండల మోడల్‌తో పాటు సార్వత్రిక సూత్రాలు గురించి వివరించారు. ప్రకృతి సేద్యానికి ప్రధానంగా అవసరయ్యే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం,కషాయాలు,మీనామృతం,పంచగవ్య తయారీపై అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులు లగుడు చిన్నమ్మలుతో మాట్లాడి సాగు విధానాన్ని తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రధాన పంటలతో పాటు అంతర పంటల వివరాలను,సాధిస్తున్న దిగుబడులపై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను బృంద సభ్యులకు వివరించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

అదేవిధంగా గ్రామ సచివాలయంలో పలు రకాల దేశవాలీ విత్తనాలు,పండ్లు,వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. వీటిని పరిశీలించిన బృందం రైతులను అభినందించింది. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులు,మహిళా సంఘాలతో సమావేశమై ప్రకృతి సాగును ఏ విధంగా ముందుకు తీసుకువెళ్తున్నారో విజయకుమార్ బృంద సభ్యులకు వివరించారు. ఇక్కడి విధానంలో వారి దేశాల్లో కూడా పంటలు సాగు చేస్తామని చెప్పడం గర్వ కారణంగా ఉందన్నారు. బృందంలో జర్మనీ,ఆస్ట్రేలియా,స్వీడన్,స్పెయిన్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు. ఈ బృందానికి చెందిన హెన్రీ మాట్లాడుతూ ప్రకృతి సాగు విధానం అద్భుతంగా ఉందని కితాబునిచ్చారు. సాగు విధానాన్ని డిజిటలైజేషన్ చేసి ప్రపంచానికి తెలియజేయడం వల్ల ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులు అందించవచ్చన్నారు. దీనిపై స్పందించిన విజయ కుమార్ మాట్లాడుతూ డిజిటలైజేషన్ చేయడంతో పాటు 800 వరకూ వీడియోలను చిత్రీకరించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 30 వేలమందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్ కృష్ణారావు, రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్, గ్రామ పెద్దలు బైలపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ విదేశాల నుండి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని ప్రజలను మోసం చేయడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 751వ రోజుకు చేరుకున్నాయి. దీక్షశిబిరంలో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం సోర్ట్స్ విభాగాల కార్మికులు కూర్చుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలుగా నడిపించాలని కోరారు.